క్లుప్తంగా

సచివాలయాల తనిఖీ



సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ జగన్‌మోహన్ రెడ్డి

కౌతాళం: మండలంలోని వివిధ గ్రామాల సచివాలయాలను శనివారం ఎంపీడీఓ జగన్ మోహన్ రెడ్డి తనిఖీ చేశారు. నదిచాగి గ్రామం సచివాలయంలో రికార్డు పరిశీలించి సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లుతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయుస్మాన్ భారత్, ఎన్సీడీ సర్వేను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ లింగన్న గౌడ కోరారు. ఎంపీడీఓ స్పందిస్తూ వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి శివప్ప, మాజీ సర్పంచ్ మారెన్న, మారెన్న గౌడ, సచివాలయ సిబ్బంది శ్రీదేవి, శివనాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్రపూరితంగానే రాహుల్‌పై వేటు

ఆదోని రూరల్ : కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిందని కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.నీలకంఠప్ప ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశం కోసం తండ్రిని, నాన్నమ్మని కోల్పోయి ఆ కుటుంబానికి అవినీతి అంటే తెలియదన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలో రాలేదని గ్రహించి, ముందస్తుగా రాహుల్‌పై అనర్హత వేటు వేశారని, అదాని గురించి ప్రశ్నిస్తే సమాధానం కరువైన విషయాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో ఆదోని ప్రధాన కార్యదర్శి వై.సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆదోని రూరల్ : బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, యువ మోర్చా జాతీయ నాయకుడు సురేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కి వినతి పత్రం అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, పట్టణ అధ్యక్షుడు బోయ మహాదేవ, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు మునిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

3న మటన్, చికెన్ షాపుల బంద్

ఆదోని టౌన్ : ఈనెల 3వ తేదీన పట్టణంలో మటన్, చికెన్ షాపులను మూసి వేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి వ్యాపారులను కోరారు.మహవీర్ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలుతెరవరాదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, మటన్, చికెన్ షాపులతో పాటు కమేళాలు కూడా పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామ ని శనివారం రాత్రి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

సలహాలు పాటిస్తే అధిక దిగుబడి

మంత్రాలయం రూరల్: ఆర్బీకే ఛానల్‌లో అధికారులు, శాస్త్రవేత్తలు వివరించే సలహాలు,సూచనలు పాటిస్తే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి జీరాగ జేష్ అన్నారు. శనివారం మండలంలోని రాంపురం, కాచాపురం, ఖగ్గల్ ఆర్బీకే కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతర ఆర్బీకే ఛానల్‌లో వ్యవసాయ, పశుసంవర్ధక, హార్టికల్చర్ శాఖలకు సంబంధించి ఏప్రిల్ నెలలో ప్రసారమయ్యే వివరాలకు సంబంధించిన నివేదికలను రైతులకు వివరించారు. రైతులకు సందేహాలు ఉంటే నేరుగా ఫోన్ ద్వారా సమస్య పరిష్కారానికి అవసరమైన సమాచారం పొందవచ్చునని పేర్కొన్నారు.

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జి బసవరాజు శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. శనివారం వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం, స్వామి వారి మెమొంటో, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పీఠాధిపతి నుంచి మెమెంటో అందుకుంటున్న హైకోర్టు జడ్జి బసవరాజు

ఫోన్ కొట్టు.. పరిష్కారం పట్టు

- సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం
- సెల్ నంబర్‌లో సంప్రదించాలంటున్న యంత్రాంగం
- మెరుగైన పాలనకు ప్రభుత్వ చర్యలు

మంత్రాలయం రూరల్: రోజు రోజుకు పెరుగుతున్న ఎండల కారణంగా నీటి ఎద్దడి, విద్యుత్ కోతలు, అగ్ని ప్రమాదాలు, దొంగల బెడద, ఆరోగ్య సమస్యల వంటివి వెంటాడుతుంటాయి. ప్రస్తుత సీజన్‌లో మంచినీరు, విద్యుత్, పోలీస్, అగ్నిమాపక శాఖల అవసరం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వివిధ శాఖల పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియక సామాన్యులు ఇబ్బందులు పడుతుంటారు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారించేందుకు అధికారులు అందుబాటులో ఉన్నా.. వారికి గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలు తెలియకపోవచ్చు. వాటి పరిష్కారం కోసం గ్రామాల్లో అధికారులు అలసత్వం వహిస్తే నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారించుకోవచ్చు. తమ గ్రామంలో సమస్యలను మండల స్థాయి అధికారికి వివరిస్తే పరిష్కరానికి కృషి చేస్తారు.

ఆయా సమస్యలపై సంప్రదించాల్సిన అధికారుల ఫోన్ నంబర్లు

- మంచినీటి సమస్యల పరిష్కారం కోసం..
  - మంత్రాలయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూపిణి : 9100122521
  - కోసిగి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున : 9100122534
  - పెద్దకడబూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్ : 9100122535
  - కౌతాళం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుపమ : 9100122510



నియోజకవర్గంలోని మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గ్రామాల్లో పైపు లైన్లు మరమ్మతులకు గురై, మలినాలు వస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ లీకేజీలతో తాగునీరు కలుషితమై వ్యాధులు సంభవిస్తాయి. సమస్య అధికంగా ఉంటుందో వెంటనే ఆ మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇస్తే సమస్యను పరిష్కరిస్తారు.

- విద్యుత్ అంతరాయం ఉంటే..
  - నియోజకవర్గంలోని విద్యుత్‌శాఖ ఏఈల ఫోన్ నంబర్లు:
  - డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌విశ్వశాంతిస్వరూప్ : 9491056414
  - మంత్రాలయం ట్రాన్స్‌కో ఏఈ గోవిందు : 9440813387
  - పెద్దకడబూరు ట్రాన్స్‌కో ఏఈ నాగవేంద్రం : 7382614130
  - కోసిగి ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ : 9440813388
  - కౌతాళం ట్రాన్స్‌కో ఏఈ నరసన్న : 9493193228



వేసవిలో ఎండలు పెరగడమే కాదు. విద్యుత్ వాడడం కూడా విపరీతంగా పెరుగుతుంది. ఈదురు గాలులకు తీగలు తెగిపడటం, స్తంభాలు నెలకొరగడంలో వోల్టేజీ సమస్య, ఫీజులు పాడవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఎక్కడైతే సమస్య తల్తెతుందో వెంటనే ఆయా మండలాల అధికారులకు సమాచారం అందిస్తే వెంటనే సిబ్బందితో మరమ్మతులు చేయించేందుకు వీలుంటుంది.

- అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త ..
  - టోల్‌ఫ్రీ నంబర్: 101
  - ఎమ్మిగనూరు అగ్నిమాపక అధికారి ఆంజనేయులు :9963738627
  - కార్యాలయం ల్యాండ్ ఫోన్ నంబర్: 08512–255101



వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. కొద్ది పాటి నిర్లక్ష్యంతో ఘోర ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. విద్యుదాఘాతం, పొయ్యిలో నిప్పులను వదలడం, సిగరేటు పీకలను ఆర్పకుండా పడేయడం, పంటచేలో, నివాసాల మధ్యలో వ్యర్థాలకు మంట పెట్టడం వంటివి చేస్తే ప్రమాదాలు సంభవిస్తాయి. తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం, ఎండలు ఎక్కువగా ఉండటం, ఈదురు గాలులకు మంటలు వ్యాపించి నష్టం కలుగజేస్తాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. సకాలంలో సమాచారం అందిస్తే ప్రమాద తీవ్రత తగ్గించవచ్చు.

- ఆరోగ్యంపై అలసత్వం వద్దు..
  - టోల్‌ఫ్రీ: 108



పనులపై బయటకు వెళ్లిన సమయంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బీపీ సమస్యలు, డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తితే వీలైనంత త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణనష్టం లేకుండా కాపాడవచ్చునని వైద్యులు చెబుతున్నారు. అగ్ని, రహదారి ప్రమాదాలు సంభవించిన సమయంలో, అత్యవసర సమయాల్లో 108కి నంబర్‌కు సమాచారమిస్తే త్వరగా వైద్య సేవలు అందుతాయి.

- దొంగల భయం..
  - నియోజకవర్గంలోని సబ్‌ఇన్‌స్పెక్టర్ల ఫోన్ నంబర్లు..
  - మంత్రాలయం సీఐ శ్రీనివాసులు : 9121101151
  - కోసిగి సీఐ పరిషావలి : 9121101154
  - మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు : 9121101152
  - మాధవరం ఎస్ఐ కిరణ్ : 9121101153
  - పెద్దకడబూరు ఎస్ఐ శ్రీనివాసులు : 9121101156
  - కోసిగి ఎస్ఐ రాజారెడ్డి : 9121101155
  - కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి : 9121101145



వేసవిలో దొంగల భయం ఎక్కువ. ఎండ వేడిమి కారణంగా ఇంటిలోపల కాకుండా ఆరుబయట, భవనంపై నిద్రపోవడం వంటివి చేస్తుంటారు. బంధువుల ఇంటికి, విహార యాత్రలకు వెళ్తుంటారు. ఇదే అదనుగా దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరిగినా, పక్క ఇళ్లలోని వారు ఇతర ప్రాంతాలకు వెళ్లిన సమయాల్లో ఆ ఇంట్లో శబ్దాలు వినిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. స్థానిక అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోతే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం చెబితే సంబంధిత పోలీసు అధికారులు వెంటనే స్పందిస్తారు.

పల్లెల్లో గొడవలకు అవకాశమివ్వొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

మంత్రాలయం రూరల్: చిన్న విషయాలకు పల్లెల్లో గొడవలకు పాల్పడవద్దని, అంతేకాకుండా వాటి పేరుతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించమన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రశాంత వాతవరణంలో అందరూ కలిసికట్టుగా మెలగాలన్నారు. ఎవరైనా గొడవలు సృష్టించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, పేకాట,మట్కా వంటి జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అంతకుముందు మంత్రాలయంలో వెలసిన గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి, రచ్చుమర్రి గ్రామంలో వెలసిన బంగారమ్మవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, వెంకటేశ్వర్లు, కిరణ్ ఉన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

ఆదోని టౌన్ : పట్టణంలోలో శానిటేషన్‌ను వంద శాతం మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పారిశుద్ధ్య విభాగం అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని బండిమెట్ట, రైల్వేస్టేషన్ రోడ్డు, ప్రధాన రోడ్డుతో పాటు మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతే లక్ష్యంగా చర్యలు చేపడతున్నామని, వీధుల్లో చెత్తను ఏ రోజుకు ఆ రోజు తొలగించాలని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మేస్త్రీలు ఉన్నారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించండి



కిట్లను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా లేదా అనే నేరుగా సచివాలయ కన్వీనర్లు, గృహభసారథులు, వలంటీర్లు వెళ్లి అడిగి తెలుసుకోవాలని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి 5 అంశాల అభిప్రాయ సేకరణ చేసి మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు ప్రజలకు అందించాలన్నారు. నమ్మకం అయితే ప్రతి ఇంటి నుంచి 8296082960కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరాలన్నారు. రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలుపించుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామని కోరారు. అనంతరం మండలంలోని 19 సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహసారథులు మంగమ్మ, దొడ్డి నరసన్న, కాల్వ లక్ష్మయ్య, బుళ్లి నరసింహులు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రాణాలు నిలిపే బీఎల్ఎస్‌పై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వై.అశోక్

కర్నూలు(హాస్పిటల్): బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్) శిక్షణ తీసుకుంటే ప్రాణాపాయస్థితిలో ఉన్న చాలా మంది ప్రాణాలు కాపాడవచ్చని బీఎల్ఎస్ ఇన్‌స్ట్రక్టర్, అనెస్తెటిస్ట్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ వై.అశోక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజి టెక్నీషియన్లు, బీఎస్సీ, జనరల్ నర్సింగ్ సిబ్బందికి బీఎల్ఎస్‌పై రెండురోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ వై.అశోక్ మాట్లాడుతూ సమాజంలో బాధ్యత గల ప్రతి పౌరుడూ బీఎల్ఎస్ శిక్షణ తీసుకోవాలని, తద్వారా ఎవ్వరికైనా ప్రాణాపాయ పరిస్థితి వచ్చినప్పుడు అత్యవసరంగా ఛాతిపై ఒత్తిడి తెచ్చి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. బీఎల్ఎస్ ప్రక్రియలో ప్రతి నిమిషానికి వందసార్లు ఛాతిపై ఒత్తిడి తేవాలని, అందులో ప్రతి 30సార్లకు ఒకసారి నోటిలో గాలిని ఊదాలని చెప్పారు. ఈ క్రమంలో రోగి స్పృహలోకి వచ్చే వరకు ఒత్తిడి చేస్తూ ఉండాలని సూచించారు. హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గన్నవరంకు చెందిన డాక్టర్ వై.అశోక్ యుపీ, పీజీ, బిఎస్సీ నర్సులకు బీఎల్ఎస్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని, ఇప్పటి వరకు ఆయన 93వేల మందికి ఈ శిక్షణ అందించారని తెలిపారు. భారత సైన్యంలోనూ ఆయన 22 ఏళ్లు పాటు వివిధ దశలో దేశసేవ చేశారని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా నిలవాలి



మాట్లాడుతున్న జిల్లా నాల్గవ అదనపు జడ్జి జి.ప్రతిభాదేవి



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు

కర్నూలు(లీగల్): ఫోక్సో కేసుల్లో బాధితులకు ప్రభుత్వం పరంగా అందాల్సిన నష్టపరిహారం కాని ఇతరత్రా వాటిని అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు అండగా నిలవాల్సిన అవసరం ఉందని జిల్లా నాల్గవ అదనపు జడ్జి జి.ప్రతిభాదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో పోలీసు అధికారులకు, ప్యానల్ న్యాయవాదులకు ఫోక్సో చట్టం, రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకట నాగశ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఫోక్సో చట్టం బాధితుల పరిహార పథకం 2015 ప్రకారం లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు ఎన్ఏఎల్ఎస్ఏ పరిహార పథకం, 2018 సంవత్సరం న్యాయాధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ, న్యాయవాదులతో బాధితుల పరిహార పథకాల గురించి అవగాహన కల్పించారు. మహిళా కోర్టు న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద కేసుల్లో చట్టాల్లో నిబంధనలపై సవరణ చట్టం, కాల పరిమితి, పోలీసు, బాధితులు, డ్రైవర్లు, యాజమాన్యం, ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయస్థానాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పాండురంగారెడ్డి, సబ్ జడ్జి దివాకర్, జూనియర్ సివిల్ జడ్జిలు షర్మిల, జ్యోత్స్న దేవి, వందన కల్యాణి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే జగనన్న లక్ష్యం





వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కార్యక్రమానికి హాజరైన మహిళలు

ఆదోని టౌన్ : పొదుపు సంఘాల మహిళలను లక్షాధికారులను చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పథకాలను వారి పేరుతో అమలు చేయడం, అన్ని పదవుల్లో వారికి సగం వాటా తదితర వాటిల్లో మహిళలకు ప్రాధాన్యతనిచ్చి వారి మనస్సుల్లో సీఎం చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాడన్నారు. శనివారం మున్సిపల్ క్రీడా మైదానంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి 31 వార్డుల పరిధిలోని మహిళలకు రూ.9.17 కోట్లు మెగా చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళలకు పెద్దపీట వేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. పొదుపు సంఘాల మహిళలను నట్టేట ముంచిన ఘనత చంద్రబాబుకే దక్కిందని విమర్శించారు. మహిళలను గౌరవించే పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని చెప్పారు. 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మహిళలే మరోసారి అధికారంలోకి వచ్చేలా చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలేకల్ రేణుక, నాయకులు బాలాజీ, ఫయాజ్, తిమ్మప్ప, లక్ష్మీదేవి, చంద్రకాంత్ రెడ్డి, నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మప్ప, మాధవరెడ్డి, వీరభద్రారెడ్డి, నరసింహులు, తాయన్న, సంజీవ్, మల్లికార్జున, మజార్‌అహ్మద్, భాస్కర్, సీఎంఓ షమీనా పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు మంజూరైన ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు యంత్ర సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండిగిరిలోని రైతుభరోసా కేంద్రం-1, 2కు సంబంధించి వైఎస్సార్ యంత్ర సేవా కింద బసవేశ్వర రైతు మిత్రగ్రూపు, శ్రీ ఉరుకుంద ఈరన్నస్వామి రైతుమిత్ర గ్రూపులకు మంజూరైన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యూనిట్ పూర్తి విలువ రూ.15 లక్షలు కాగా, రైతు వాటా 10 శాతం (రూ.1.50 లక్షలు) బ్యాంకు లోన్ 50 శాతం (రూ.7.5 లక్షలు), ప్రభుత్వ సబ్సిడీ 40 శాతం (రూ.6 లక్షలు) జమ చేయబడుతుందన్నారు. ఇప్పటివరకు మండలంలోని 37 ఆర్‌బీకేలకు గానూ 29 ఆర్‌బీకేలకు యంత్ర పరికరాలు, యంత్రాలు అందజేశామని చెప్పారు. మిగిలిన వారు కూడా 5వ తేదీ లోగా పొందాలని సూచించారు. అలాగే మండలానికి మూడు డ్రోన్స్ మంజూరయ్యాయని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, ఆనంద్, కామాక్షి తిమ్మప్ప, ఆదోని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.గిరీష్, ఏఓ పి.పాపిరెడ్డి పాల్గొన్నారు.

నేడు సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వంద సంవత్సరాల 'మాలపల్లి' ఉన్నవ లక్ష్మీనారాయణ నవలపై సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. ఎస్.వి. కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. సాయిగోపాల్ ముఖ్య అతిథిగా, ప్రసిద్ధ సాహితీ వేత్త, ఎస్‌వీయూ పూర్వపు వైస్‌ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ ప్రధాన వక్తగా హాజరు కానున్నట్లు చెప్పారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

నందవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నయని డాక్టర్ చంద్రకాంత్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం-2 ఆవరణలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేడు 'కథా స్రవంతి' ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన 'కథా స్రవంతి' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పాలగిరి విశ్వప్రసాద్, తవ్వా ఓబుల్‌రెడ్డి, ఉమామహేశ్వర్, జంధ్యాల రఘుబాబు, డాక్టర్ చంద్రమౌళిని ముఖ్య వక్తలుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ అభిమానులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కూలి పెంపు అమల్లోకి

తుగ్గలి: ఉపాధి హామీ కూలీలకు వేసవి భత్యాన్ని తొలగించిన కేంద్ర ప్రభుత్వం దినసరి కూలీని పెంచి స్వల్ప ఊరట కల్పించింది. ఇది వరకు రూ.257గా ఉన్న కూలీకి రూ.15పెంచి రూ.272కు చేసింది. పెంచిన వేతనాలు శనివారం నుంచి అమల్లోకి తెస్తూ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. తద్వారా ఇకపై ఉపాధి పనులకు వచ్చే కూలీలకు కొత్త వేతనం వర్తించనుంది.

ముగిసిన వేలంపాటలు

ఆలూరు: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని బస్టాండు, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్ వేలంపాటలను శనివారం ఈఓ కృష్ణకుమార్ సమక్షంలో నిర్వహించారు. బస్టాండును రూ.7,76000 వెంకటలక్ష్మి, వారపు సంతను రూ.2,60.000కు నాగరాజు, దినసరి కూరగాయల మార్కెట్‌ను రూ.4,49,000కు వెంకటలక్ష్మి దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఏడాదితో రూ.6,69,000 ఆదాయం తగ్గిందని ఈఓపీఆర్డీ ఎం.ప్రకాష్ నాయుడు, ఈఓ కృష్ణకుమార్ తెలిపారు.